ప్రజాశక్తి

పలాస రైల్వేస్టేషన్ సందర్శన

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వే స్టేషన్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ డిఆర్ఎం ఎ.త్రిపాఠి బుధవారం సందర్శించారు. ముందుగా ఆయన ప్రత్యేక రైలులో మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చారు. రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పలాస రైల్వే స్టేషన్ నుంచి ఎంత ఆదాయం వస్తుంది, ప్రయాణికులకు ఎటువంటి సేవలు అందిస్తున్నారు, స్టేషన్‌కు ఇంకా ఏమైనా అవసరాలు అవసరమా తదితర అంశాలను రైల్వే అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు రైల్వే అధికారులు సిబ్బందిపాల్గొన్నారు.

పరిశీలిస్తున్న డిఆర్ఎం త్రిపాఠి

పచ్చని భూముల్లో చిచ్చు రేపొద్దు

- కార్గో ఎయిర్‌పోర్టు విషయంలో ప్రభుత్వానికి భంగపాటు తప్పదు
- అచ్చెన్న వ్యవసాయ మంత్రా? విధ్వంస మంత్రా?
- ప్రజల తరుపున నిలబడతారా, లేదో ఎమ్మెల్యే శిరీష తేల్చుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, వజ్రపుకొత్తూరు

కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం పేరుతో పచ్చని భూముల్లో చిచ్చు రేపొద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరులో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన ర్యాలీ, అనంతరం సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉద్దానం ప్రాంతంలోని పచ్చని పొలాల్లో ప్రభుత్వం ఎయిర్‌పోర్టు పేరుతో చిచ్చు రేపాలని చూస్తోందని విమర్శించారు. జిల్లాకు ఎయిర్‌పోర్టు తీసుకొస్తున్నామని విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్తున్నారని, ఎగుమతులు విమానాల్లో జరగవని, షిప్‌ల్లో మాత్రమే ట్రాన్స్‌పోర్టు అవుతాయని చెప్పారు. ఎయిర్‌పోర్టు పేరుతో భూములు తీసుకుని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. పచ్చని పంట పొలాలను నాశనం చేసే ఎయిర్‌పోర్టును వద్దని చెప్పాల్సిన వ్యవసాయశాఖ మంత్రి వెనుబడిన ఉద్దానం ప్రాంతానికి అవసరమని చెప్తున్నారని, ఆయన వ్యవసాయ మంత్రా, విధ్వంస మంత్రా అని ప్రశ్నించారు. జీడి, పొగాకు, మామిడి, కోకో పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు రోడ్డెక్కుతున్నారని ఎన్నికల ముందు ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. పలాసలో కిడ్నీ వ్యాధులు రాకుండా చేస్తానని చెప్పిన పవన్ కళ్యాణ్ ఎన్నికల తర్వాత ఒక్కసారైనా వచ్చారా అని ప్రశ్నించారు. కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులను నియమించలేకపోయారని, కిడ్నీ ప్రభావిత గ్రామాలకు రక్షిత మంచినీటిని అందిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

ప్రజల తరుపున నిలబడతారో ఎమ్మెల్యే తేల్చుకోవాలి

కార్గో ఎయిర్‌పోర్టు నిర్మిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష ఎన్నికల ముందు ప్రజలకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో చెప్పి ఓట్లడిగితే ప్రజలు అప్పుడే నిర్ణయించేవారని చెప్పారు. ఇప్పటికైనా ఆమె ప్రజల తరుపున నిలబడుతారో, లేదో తేల్చుకోవాలన్నారు. ఎయిర్‌పోర్టును కొద్దిమంది వ్యతిరేకిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు చెప్తున్నారని, ఆ మాటలేవో ఇక్కడి గ్రామాల్లో సభలు పెట్టి చెప్పాలన్నారు. ఇది ప్రజల సమస్య గానీ రాజకీయ సమస్య కాదని స్పష్టం చేశారు. ప్రజలు వద్దకున్న కార్గో ఎయిర్‌పోర్టును బలవంతంగా రుద్దడం సరికాదన్నారు. కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ప్రజలు సాగించే పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పోరాటానికి సమయం ఆసన్నం : కొమర వాసు

సభాధ్యక్షులు, కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు మాట్లాడుతూ ప్రజల జీవనాధారమైన పొలాలను ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు మాట్లాడుతూ ఉద్దానంలో కిడ్నీ వ్యాధులు, జీడి పంటకు మద్దతు ధర వంటి సమస్యలు వదిలేసి ఎయిర్‌పోర్టు కడతామని చెప్పడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. ఒంకులూరు సర్పంచ్ ప్రతినిధి జోగి అప్పారావు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా భూముల్లో మార్కింగ్ చేసి నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ఉలుకూ పలుకూ లేని విమానయాన మంత్రి

తన నియోజకవర్గానికి ఎయిర్‌పోర్టు ఇస్తానంటే వద్దని, వెనుకబడిన ఉద్దానం ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఇక్కడ అవసరమని మంత్రి అచ్చెన్నాయుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినప్పుడూ ఉద్యోగాలు వస్తాయని, అభివృద్ధి చెందిపోతుందని చెప్పారని... తర్వాత అది దివాలా తీసిందని గుర్తు చేశారు. మందస కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ఎనిమిది నెలలుగా ప్రజలు ఆందోళనలు చేస్తుంటే కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఉలుకూ పలుకూ లేదన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా వచ్చే నెలలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ పచ్చని భూములపై పాలకుల కన్నుపడిందని, అంతా తిరగబడితే గానీ భూములు దక్కవన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ భూములను రక్షించుకోవడానికి చావోరేవో తేల్చుకోవాలన్నారు. సిపిఐ లిబరేషన్ నాయకులు ఎం.రామారావు మాట్లాడుతూ రాజకీయ పార్టీల వారీగా గ్రామాల్లో చీలిక తెచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయని, సమిష్టిగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, పిఒడబ్ల్యుయు జిల్లా కార్యదర్శి పి.కుసుమ, జీడి రైతుసంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఎన్.గణపతి, జోగి శ్రీదేవి, జె.సింహాచలం, ఎస్.లక్ష్మీనారాయణ, జి.బాలకృష్ణ, పోరాట కమిటీ నాయకులు, ధనంజయరావు, డి.రామారావు, ఎం.తులసీరావు, గుంటు రామస్వామి, లండ రామస్వామి, ఎం.సంతోష్ పాల్గొన్నారు.

హమాలీల ఉపాధిని కాపాడాలి

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు
వినతిపత్రం అందజేస్తున్న హమాలీ యూనియన్ నాయకులు

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు కోసం ఇచ్చిన ఉత్తర్వుల ఉపసంహరించుకోవాలని, హమాలీల ఉపాధిని కాపాడాలంటూ ఎపిబిసిఎల్, ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ నాయకులు కోరారు. జిల్లాకు వచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో యూనియన్ నాయకులు డి.బంగార్రాజు, ఎన్.రమణ, జి.శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి

- పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు సముచిత గౌరవం
- ఎమ్మెల్సీ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

మాట్లాడుతున్న నాగబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కూటమి ప్రభుత్వ పరిపాలనపై ప్రజల్లో సంతృప్తి ఉందని ఎమ్మెల్సీ, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. జిల్లా పర్యటనలో నగరంలోని ఒక హోటల్‌లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యకర్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకుని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కొంచెం ముందు వెనుక అయినా పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారిస్తానని, ఇక్కడ పార్టీ ఎదుగుదల కోసం ఎక్కువ సమయం కేటాయించి పనిచేస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో వార్డు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతానన్నారు. కూటమి పార్టీలైన జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పరస్పరం గౌరవం ఇచ్చిపుచ్చుకుని రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, నియోజకవర్గాల సమన్వయకర్తలు పేడాడ రామ్మోహన్, గేదెల చైతన్య, దాసరి రాజు, విశ్వక్సేన్, వేగులాడ దుర్గారావు, కణితి కిరణ్ కుమార్, బలగ ప్రవీణ్, పొగిరి సురేష్ బాబు, జిల్లా, మండల ముఖ్య నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

రహదారుల భద్రతే ప్రథమం

- బ్లాక్ స్పాట్లు, కెమెరాలు, వైద్య సేవలపై దృష్టి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రహదారుల భద్రతపై నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డితో కలిసి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు రక్షించాలంటే రహదారులు బాగా ఉండాలన్నారు. చిన్న వర్షాలు పడితేనే జాతీయ రహదారులపై నీరు నిలుస్తోందని, దీనివల్ల వాహనదారుల ప్రాణాలకు ముప్పు తలెత్తుతోందని తెలిపారు. స్వయంగా పలాస వద్ద సర్వీస్ రహదారిని పరిశీలించానని, సర్వీస్ రోడ్ల నిర్వహణ దయనీయంగా ఉందన్నారు. జాతీయ రహదారుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఎన్‌హెచ్ఎఐ అధికారులను తక్షణ చర్యలకు ఆదేశించారు. ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్ స్పాట్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. ముఖ్యంగా పైడిభీమవరం పారిశ్రామికవాడ రహదారి ప్రాంతాన్ని పరిశీలించి త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను కూల్చి, అక్రమంగా వాహనాల రాకపోకలకు మార్గం చేసే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందేనని హెచ్చరించారు. ప్రమాదాలు సంభవించిన వెంటనే వైద్యసేవలు అందేలా ఆరోగ్యశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. 1033 హెల్ప్‌లైన్ బోర్డులు తెలుగులో ఏర్పాటు చేయాలని, మలుపుల వద్ద బ్యారికేడ్లు, స్టాపర్లు, ప్రమాద సంకేత బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే వారిపై జరిమానాలు విధించి కేసులు నమోదు చేయాలన్నారు.

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రమాదాల దర్యాప్తునకు సిసి కెమెరాలు కీలకమన్నారు. జిల్లాలో కొన్ని కెమెరాలు పనిచేయడం లేదని చెప్పారు. ముఖ్యంగా రాత్రివేళల్లో అవి ఆగిపోతున్నాయని, వాటి నిర్వహణపై పర్యవేక్షణ ఉండాలన్నారు. దీనిపై ఎన్‌హెచ్ఎఐ ప్రాజెక్టు డైరెక్టర్ తివారి స్పందిస్తూ విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల సమస్యలు వస్తున్నాయన్నారు. తగిన సాంకేతిక పరిష్కారాలను త్వరలో తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు గత మూడేళ్ల రోడ్డు ప్రమాదాల గణాంకాలను సమీక్షించారు. 2023లో 810 ప్రమాదాలు, 297 మరణాలు, 529 గాయాలు నమోదు కాగా, 2024లో (జూలై వరకు) 610 ప్రమాదాలు, 279 మరణాలు, 902 గాయాలు చోటుచేసుకున్నాయి. 2025లో (జూలై వరకు) ప్రమాదాల సంఖ్య కొంత తగ్గి 497గా నమోదైందన్నారు. కానీ మరణాలు 153, గాయాలు 409గా ఉండడం ఆందోళన కలిగిస్తోందని వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బి ఎస్ఇ పి.సత్యనారాయణ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ విజయసారథి, డిపిఒ భారతి సౌజన్య, డిఎస్‌పి వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

పదవి అధికారం కాదు.. బాధ్యత

ఎమ్మెల్యే గౌతు శిరీష

కూర్మారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి - పలాస

పదవి అన్నది అధికారం కాదని, బాధ్యత అని, అందివచ్చిన పదవిని బాధ్యతతో పనిచేసి రైతులకు మేలు చేకూరేవిధంగా పనిచేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక పిఎసిఎస్ కార్యాలయంలో బుధవారం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతిఒక్కరూ సమన్వయం పాటించాలని ఆశిస్తున్నానన్నారు. మన ప్రత్యర్థి బలమైన వ్యక్తి కాదని, మనలో విభేదాలను అయన అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కార్యకర్తలు కింద స్థాయి నాయకులకు గౌరవించి గొలుసుకట్టు ప్రణాళికతో ముందుకు పోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మనమంతా సమన్వయంతో పనిచేసి శతశాతం విజయం సాధించాలన్నారు.

పిఎసిఎస్ చైర్మన్ పదవిని వన్నె తెస్తా

పలాస పిఎసిఎస్ చైర్మన్ పదవికి వన్నె తెచ్చే విధంగా పనిచేసి, రైతులు మనలు పొందే విధంగా పనిచేస్తానని పిఎసిఎస్ చైర్మన్ వంకల కూర్మారావు అన్నారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తే పదవులు వస్తాయని గౌతు కుటుంబం నిరూపించి తనకు పదవి ఇచ్చారని, ఆ కుటుంబానికి రుణపడి ఉంటానని అన్నారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి ఏ సమస్య వచ్చిన పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానన్నారు. పిఎసిఎస్ నుంచి రైతులకు అందాల్సిన అన్ని సౌకర్యాలు అధికారులు భాగస్వామ్యంతో అందిస్తాన ని అన్నారు. అనంతరం కూర్మారావును ఎమ్మెల్యే దుశ్శాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎవిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు బడ్డ నాగరాజు, పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, కుత్తుమ లక్ష్మణకుమార్, వడ్డి యాదగిరి, టి.గంగారాం తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై కేంద్ర బృందం సంతృప్తి

గ్రామీణాభివృద్ధి పనుల మెరుగుదలకు కీలక సూచనలు

సమీక్షిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పథకాల అమలుపై కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని లోపాలను గుర్తించి వాటిని సరిదిద్ది మరింత సమర్ధవంతంగా అమలు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేసింది. కేంద్ర పథకాల అమలును పరిశీలించిన బృందం, తమ పది రోజుల పర్యటన అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు సునీల్ బంటా, నతూ సింగ్ మాట్లాడుతూ, గ్రామీణ పేదలందరికీ పథకాల ప్రయోజనాలు అందాలనేదే తమ ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలో చేపట్టిన పర్యటనపై తాము సంతృప్తిగా ఉన్నామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు పథకాల ద్వారా అందుతున్న లబ్ధిని అభినందించారు. అదే సమయంలో, కొన్నిచోట్ల అమల్లో ఉన్న లోపాలను గుర్తించి, పథకాల ప్రయోజనాలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. కేంద్ర బందం ఇచ్చిన సూచనలను అమలు చేసి, జిల్లాలో గ్రామీణాభివృద్ధి పథకాలను మరింత పారదర్శకంగా, సమర్ధవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

పది రోజుల విస్తృత పర్యవేక్షణ

జూలై 21 నుంచి 30వ తేదీ వరకు కేంద్ర బృందం జిల్లాలోని పలు మండలాల్లో విస్తృతంగా పర్యటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమగ్ర పర్యవేక్షణ చేపట్టింది. ఈ పర్యవేక్షణలో భాగంగా సంతబొమ్మాళి మండలంలోని బోరుభద్ర, ఉమ్మిలాడ, తాల్లవలస.. కొత్తూరు మండలంలోని కొత్తూరు, నివగాం, నేరడి... శ్రీకాకుళం మండలంలోని రాగోలు, శిలగాం-సింగువలస పంచాయతీల్లో పర్యటించారు. ఈ గ్రామాల్లో స్వయం సహాయ సంఘాల పనితీరు, ఉపాధి హామీ అమలు, ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణాలు, గ్రామీణ రహదారుల పథకం ద్వారా రోడ్ల నిర్మాణం, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన, ఆర్‌సెటిఐ వంటి పథకాల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి పథకాల ప్రయోజనాలపై ఆరా తీశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు కిరణ్ కుమార్, డ్వామా పథక సంచాలకులు సుధాకరరావు, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

13 నుంచి జిల్లా ఉత్సవాలు

శ్రీకాకుళం : జిల్లా ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 13న శోభాయాత్ర, భోజన కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. 14న సంప్రదాయ క్రీడలు, రచన, చిత్రలేఖన పోటీలు ఉంటాయన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, గౌరవ సత్కారాలతో పాటు ఆహారోత్సవం నిర్వహిస్తామన్నారు. 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. జాతీయ పతాక ఆవిష్కరణతో పాటు జిల్లా 75 ఏళ్ల ప్రస్థానంపై ప్రసంగాలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా అరసవల్లి ఆలయం, రైల్వే స్టేషన్, జాతీయ రహదారి-16 జంక్షన్ల వద్ద ప్రత్యేక లైటింగ్, పూల అలంకరణలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జి దుర్మార్గం

శ్రీకాకుళం సిటీ: టిడిపి కూటమి ప్రభుత్వం నెల్లూరు కార్పొరేషన్‌లో బలవంతంగా రుద్దుతున్న వర్క్ అవుట్‌సోర్సింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ 18 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసుల లాఠీఛార్జి చేయడం దుర్మార్గమని సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు అన్నారు. మున్సిపల్ కార్మికులపై దాడిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నగరంలోని మస్టర్ పాయింట్ల వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పోలీస్ నిర్బంధాన్ని ప్రయోగించి, అక్రమ అరెస్టులు చేయడం హేయమైన చర్య అని దుయ్యబట్టారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను కాంట్రాక్టర్లకు బందీలుగా మార్చే కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయొద్దని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించి బలవంతంగా వర్క్ అవుట్ సోర్సింగ్ విధానం అమలుకు ప్రయత్నిస్తే రాష్ట్రమంతా పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నగర అధ్యక్షులు ఎ.గణేష్, శంకర్ గణేష్, ఎ.శంకర్, మోహన్, యుగంధర్, బి.సరోజ, ఎన్.పార్వతి, టి.ఇందు, మల్లమ్మ, ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

జర్మనీలో నర్సు ఉద్యోగాలకు నమోదు

శ్రీకాకుళం: జర్మనీలో నర్సుగా ఉద్యోగం చేయాలనుకునే ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆగస్టు ఏడో తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల వయసు 24 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలని, జిఎన్ఎం గానీ బిఎస్‌సి నర్సింగ్ పూర్తి చేసి కనీసం మూడేళ్ల అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.2.40 లక్షల నుంచి రూ.3.10 లక్షల వరకు జీతం చెల్లిస్తారని తెలిపారు. ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలు, వీసా రవాణా సౌకర్యం, ఒక్కసారి స్వదేశానికి వచ్చి వెళ్లేందుకు విమాన టిక్కెట్లు వంటి సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలనుకునే అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో డిఆర్‌డిఎ కాంప్లెక్స్ ప్రాంగణంలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత



మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి ఫోన్ కాల్స్‌ను గర్భిణులు వినాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కిల్కారీ సేవలపై బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఆశా నోడల్ ఆఫీసర్స్ శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాంను గర్భిణులు, బాలింతల కోసం ప్రవేశపెట్టిందని తెలిపారు. మాతా శిశు మరణాలు తగించడమే లక్ష్యమన్నారు. గర్భిణి నాలుగో నెల మొదలుకొని బిడ్డకు సంవత్సరం వచ్చే వరకు కిల్కారి కాల్స్ వస్తాయని తెలిపారు. వాయిస్ కాల్స్ వారానికి ఒకసారి వస్తాయని, రెండు నిమిషాలు లోపు ఉంటుందని వివరించారు. కాల్స్ వచ్చిన తర్వాత తల్లీబిడ్డల ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అందజేస్తారన్నారు. కిల్కారి కాల్ నంబర్ 01244451660 గర్భిణుల మొబైల్‌లో సేవ్ చేసుకోవాలని సూచించారు. ఒకవేళ తిరిగి ఆ సమాచారాన్ని వినాలంటే 14423 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి వినవచ్చన్నారు. అవసరమనుకుంటే ఫోన్ రికార్డింగ్ చేసుకోవాలని చెప్పారు. నోడల్ ఆఫీసర్స్ అందరూ వారి పిహెచ్‌సిల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు ఆశా, ఎఎన్ఎంలు ద్వారా కిల్కారి గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. వాళ్ల మొబైల్‌లో కిల్కారి నంబర్స్ సేవ్ అయి ఉన్నప్పుడే కాల్ వచ్చినప్పుడు ఎత్తి వినగలుగుతారని తెలిపారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ రాందాస్, కిల్కారి ప్రోగ్రాం ప్రాంతీయ అధికారి కె.మౌనిక, డిపిహెచ్ఎన్ఒ శైలజ, డిసిఎం రవిప్రసాద్ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో మెరుగుపడాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

నగరపాలక సంస్థలో విలీనమైన పెదపాడు పంచాయతీలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తీరుతెన్నులపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందస్తు సమాచారం లేకుండా చేపట్టిన ఈ పర్యటనలో స్థానిక పొందర వీధి, రామాలయం వీధుల్లో పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. కాలువల పరిశుభ్రత, చెత్త సేకరణ, తాగునీటి సరఫరా ఆదేశాలు జారీ చేశారు. ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పర్యటన సందర్భంగా కలెక్టర్ స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా, మహిళలు తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని, తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల ఫిర్యాదులపై కలెక్టర్ వెంటనే స్పందిస్తూ తాగునీటి సరఫరాలో అంతరాయం ఉందని మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు. పారిశుధ్యంపై మరింత శ్రద్ధ పెట్టాలన్నారు. మరో రెండు రోజుల్లో మళ్లీ పెదపాడుకు వస్తానని, అప్పటికి పరిస్థితి మెరుగై ఉండాలని ఆదేశించారు. పెదపాడులో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడేలా, తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా తక్షణమే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారు. ఈ ఆకస్మిక పర్యటనలో మున్సిపల్ కమిషనర్ బి.వి.డి.ప్రసాదరావు, కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో రెండు రోజుల్లోగా పెదపాడులో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి- పలాస

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 18 రోజులుగా సమ్మె చేస్తున్న నెల్లూరు మున్సిపల్ కార్మికులపై పోలీస్ లాఠీఛార్జీ చేయడాన్ని ఖండిస్తున్నామని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ఈ ఘటనపై ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా మేరకు మస్టర్ పోయింట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.రవి, కె.వెంకట్, ఎస్.శంకర్ మాట్లాడుతూ వర్క్ కాంట్రాక్టు విధానం పూర్తిగా మేము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. అలా వ్యతిరేకించడం నేరమన్నట్టు కక్షసాధింపు చర్యలు చేపట్టి పోలీసులతో ప్రభుత్వం కార్మికులను కొట్టించడం సిగ్గుచేటని అన్నారు. ఆప్కాస్ రద్దు చేయాలని, కార్మికులు అందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.ఈశ్వరరావు, భాస్కరరావు, బి.కూర్మారావు, కె.బాలకృష్ణ, సావిత్రి పాల్గొన్నారు.


పిఒకు వినతిపత్రం అందజేస్తున్న ఆదినాయుడు తదితరులు

ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సవర ఆదినాయుడు బుధవారం సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డికి గిరిజనుల అభివృద్ధికి సంబంధించిన విషయాలపై వినతిపత్రం సమర్పించారు. సీతంపేట పిఒ కార్యాలయంలో గిరిజనులకు ట్రైకార్ రుణాలు మంజూరు చేసి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గిరిజనులకు ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం ఇతర అభివృద్ధి కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జమ్మయ్య, శాంతారావు, సవర కుమార్, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మట్టి తవ్వకాలు పరిశీలన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధిలో కేశవరావు పేట పరిధిలో గల బుడ్డవాని చెరువుతో పాటు చీడికాని చెరువులో మట్టి తవ్వకాలను అధికారులు పరిశీలించారు. బుధవారం 'ప్రజాశక్తి'లో మట్టి తరలింపు అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన రెవెన్యూ అధికారులు బుధవారం చెరువులను పరిశీలించారు. విచ్చలవిడిగా జరిగిన తవ్వకాలను పరిశీలించిన అధికారులు అవాక్కయ్యారు. ఈ విషయాన్ని తహశీల్దార్‌కు అధికారులు వివరించారు. దీనిపై తహశీల్దార్ బి.గోపాలరావు మాట్లాడుతూ ఇకపై అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్ఐ దీపిక, విఆర్ఒ బాలరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

రైతుల అభ్యున్నతే ధ్యేయం

మెళియాపుట్టి: రైతుల అభ్యున్నతికి పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు కృషి చేయాలని, ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో సకాలంలో ఎరువులను పంపిణీ చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని కోసమాల పిఎసిఎస్ ఆవరణంలో త్రిసభ్య కమిటీ బుధవారం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ మేరకు ఛైర్మన్ సలాన మోహనరావు, డైరెక్టర్లు కవిటి రామస్వామి, ధర్మాన బారికితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతుల అభ్యున్నతకు కృషి చేయాలన్నారు. సొసైటీని మరింత ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో డిసిసిబి సిఇఒ సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, బొచ్చు ప్రసాదరావు, పాతపట్నం ఎఎంసి ఛైర్మన్ ప్రతినిధి భైరిసింగి దినకర్, రవ్వల గణపతిరావు, బసవ పరమేశ్వర్‌రెడ్డి, కదంబల పైడిరాజు, సిఇఒ వాసునాయుడు, ఐదు మండలాల పిఎసిఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో ఎరువుల పిచికారీ ప్రదర్శన

ఇచ్ఛాపురం: మండలం బిర్లాంగిలో బుధవారం నానో యూరియా, నానో డిఎపి డ్రోన్ స్ప్రేయింగ్ ప్రదర్శన విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆధునిక వ్యవసాయ టెక్నాలజీలో భాగంగా డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారీ విధానాన్ని రైతులకు పరిచయం చేశారు. డ్రోన్ పిచికారీ ద్వారా పంటలపై సమానంగా, తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో ఎరువులు వేయడం సాధ్యమవుతోంది. సాధారణంగా ఒక ఎకరానికి కేవలం 7 -10 నిమిషాల్లో పిచికారీ పూర్తవుతుంది. దీనివలన కార్మిక భారం తగ్గడం, సమయం, వ్యయం ఆదా కావడం, అలాగే నేల కాలుష్యం తగ్గడంలో సహాయపడుతుంది. రైతులకు నానో ఎరువుల ప్రయోజనాలు, డ్రోన్ వినియోగానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు. రైతులు ఈ ఆధునిక విధానంపై విశేష ఆసక్తి చూపించారు. వ్యవసాయ శాఖ ఈ టెక్నాలజీ వినియోగాన్ని మరింతగా విస్తరించేందుకు అవేర్నెస్ ప్రయత్నాలు చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అజయ్ కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు భవానీ శంకర్, విలేజ్ వ్యవసాయ సహాయకులు పావని, సాయి చరణ్ పాల్గొన్నారు.

డ్రోన్‌తో ఎరువుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

వితంతు పింఛన్లు ఎప్పుడో?

నిరీక్షిస్తున్న మహిళలు

ప్రజాశక్తి- కవిటి

గత రెండేళ్లుగా వితంతు పింఛన్ల కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు. వైసిపి అధికారంలో ఉన్న సమయం నుంచి వీరి సంఖ్య అంతకంతకు పెరుగుతూనే ఉంది. కానీ వీరికి మాత్రం పింఛన్లు మంజూరు కావడం లేదు. గతంలో భర్త చనిపోయిన వెంటనే పింఛన్లు మంజూరు చేసే పరిస్థితి ఉండేది. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఆరు నెలలకు ఒకసారి మాత్రమే పింఛన్లు మంజూరు చేసే పద్ధతి అవలంభించడంతో వితంతువులకు సమస్యలు మొదలయ్యాయి. ఆ సమస్యలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

భర్తకు పింఛను వస్తేనే...

ఇటీవల కూటమి ప్రభుత్వం వితంతువులకు పింఛన్లు అందించే ప్రక్రియ ప్రారంభించింది. అయితే అది అంతమంది వితంతువులకు వర్తించే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. భర్త పింఛను తీసుకుంటూ మరణిస్తే ఆ పింఛను భార్యకు బదలాయించే ప్రక్రియ చేపట్టారు. అటువంటి వితంతువులకు వచ్చే నెల నుంచి పింఛను అందిస్తామని నాయకులు చెబుతున్నారు. అది కూడా 2019 మార్చి నుంచి 31.10.2024 మధ్యలో పింఛను తీసుకుంటూ మరణించిన వ్యక్తి భార్యకు మాత్రమే ప్రస్తుతం పింఛను అందుతుంది. మిగతా వారికి నిరీక్షణ తప్పదు.

ఒక్క కవిటి మండలంలోనే

కూటమి ప్రభుత్వం ఇవ్వబోతున్న పింఛన్లు పరిశీలిస్తే 2019 నుంచి 31.10.2024 వరకు ఒక్క కవిటి మండలంలోనే సుమారు 250 మంది వితంతువులు ప్రస్తుతం పింఛను అందుకోవడానికి అర్హులుగా తేలారు. వీరి భర్తలు గతంలో పింఛను తీసుకుంటూ మరణించడంతో ఆ పింఛను వీరికి బదలాయించడం జరిగింది. కేవలం కవిటి మండలంలోని ఇలా ఉంటే మిగతా మండలాల్లో ఇటువంటి పింఛన్లు వందల సంఖ్యలో ఉన్నట్టు సమాచారం.

ఎటువంటి ఆసరా లేని వారి సంఖ్య ఇంకా ఎక్కువే

మరోవైపు గతంలో ఎటువంటి పింఛను తీసుకోకుండా భర్త చనిపోయిన భార్యల సంఖ్య మరింత ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీరి సంఖ్య ప్రతి మండలంలో 150 నుంచి సుమారు 300 వరకు ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం వీరందరూ ఎటువంటి ఆసరా లేక భర్తను కోల్పోయి పింఛను కోసం ఎదురుచూస్తున్నారు.

నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నా

నా భర్త చనిపోయి నాలుగేళ్లు దాటింది. కానీ నాకు ఇంత వరకూ పింఛను మంజూరు కాలేదు. ఏమని అడిగితే హౌస్ హోల్డింగ్ మ్యాప్‌లో సమస్యలు ఉన్నట్టు చెబుతున్నారు. తన పేరు వేరే ఎవరో ఇంట్లో ఉన్నట్టు చెబుతున్నారు. అది ఎలా జరిగిందని అంటే తెలియడం లేదు. దాన్ని సరిదిద్ది పింఛను మంజూరు చేయాలని అప్పటి వైసిపి ప్రభుత్వం నుంచి ఇప్పటి ప్రభుత్వం వరకు ప్రయత్నిస్తూనే ఉన్నాను. కానీ ఇప్పటివరకు ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పింఛను మంజూరు చేసి ఆదుకోవాలి.

- ఆనింగి చంద్రమ్మ, నెలవంక

ఇప్పటికైనా ఇవ్వాలి

గతంలో భర్త చనిపోయిన వెంటనే భార్యకు పింఛను వచ్చే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. భర్త చనిపోవడంతో ఓ విధమైన కుంగుబాటుకు లోనయ్యే మహిళలకు పింఛను ఒక ఆర్థిక ఆసరా కల్పిస్తుంది. నా భర్త చనిపోయి సుమారు రెండేళ్లు కావస్తోంది. కానీ ఇప్పటికీ పింఛను మంజూరు కాలేదు. వితంతవుల సమస్యలు దృష్టిలో ఉంచుకుని వితంతువులకు ఎప్పటిలా వెంటనే పింఛను మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- తొరా పురియా, వరక

2019 నుంచి సమాచారం తీసుకున్నాం

గతంలో ఎప్పుడూ వితంతు పింఛన్ల పంపిణీలో జాప్యం ఉండేది కాదు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత వితంతువులకు ఇబ్బందులు మొదలయ్యాయి. భర్త చనిపోయిన వెంటనే వితంతువుకు పింఛను మంజూరు చేసే పద్ధతికి వైసిపి స్వస్తి పలికింది. ప్రస్తుతం వితంతువుల సమస్యలు దృష్టిలో ఉంచుకుని ముందుగా పింఛను తీసుకుంటున్న వ్యక్తి చనిపోతే అతని పింఛను భార్యకు ఇస్తున్నాం. ఇక మిగతా వితంతువులకు సంబంధించి 2019 నుంచి సమాచారం తీసుకున్నాం. వారికి త్వరలోనే పింఛను అందిస్తాం.

- బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

4న హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఆగస్టు 4న సోమవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అనువంశిక ధర్మకర్త, అర్చకులు, గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం హుండీలను తెరుచుటకు నిర్ణయించినట్లు నారాయణ స్వామి వారి దేవస్థానం ఉప కమిషనర్, కార్య నిర్వహణాధికారి కెఎల్‌విబి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం విజయ వంతం చేయాలని కోరారు.

పారిశుధ్యంపై చర్యలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీలో పారిశుధ్యంపై చర్యలు చేపడుతున్నట్లు ఇఒ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మేజర్ పంచాయతీలో 20 వార్డులు, 143 వీధులు ఉన్నాయని, పారశుధ్యాన్ని మెరుగుపర్చడానికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహకారంతో 50 డస్ట్‌బిన్లు, రోడ్డు శుభ్రం చేయుటకు డంపర్లు ఏర్పాటుకు మంత్రి కృషి చేశారన్నారు. పదివేల అడుగులు దాటిన భవనాలకు పన్ను వేయబడుతుందన్నారు. పాత జాతీయ రహదారి, పట్టు మహాదేవ కోనేరు అభివృద్ధికి రెండు కోట్లు మంజూరు చేశారన్నారు.

పోలాకిలో అన్నదానం

పోలాకి: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెల చివరి బుధవారం ఈ అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురుస్వామి పైల అప్పన్న తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో ఉన్న సన్నిధానం సభ్యుల ఆర్థికసాయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మినీ గోకులాల బిల్లుల చెల్లింపునకు చర్యలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

2014 నుంచి 2019 వరకు మినీ గోకులం బిల్లులు, పశుగ్రాసం బిల్లులు చెల్లింపునకు చర్యలు చేపట్టినట్లు పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ సిహెచ్ నరసింహులు తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఉపాధిహామీ పథకం నుంచి చెల్లింపు జరగకపోతే ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిఒ, పశుసంవర్ధశాఖ వైద్యులను కలవాలని లబ్ధిదారులకు సూచించారు.

సెంటర్ లైటింగ్ ఏర్పాట్లు పరిశీలన

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలో సెంటరు లైటింగ్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై సుడా ఎస్‌సి సగుణాకరరావు, ఇతర ఇంజినీర్‌లు బుధవారం పరిశీలించారు. సెంటర్ లైటింగ్, డివైడర్ మెరుగుపర్చేందుకు రెవెన్యూ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు పరిశీలించారు. ఈయన వెంట ఎఇ జగదీష్, కమిషనర్ నల్లి రమేష్, సిబ్బంది ఉన్నారు.

గ్రామకంఠ భూముల సర్వే వేగవంతం

నరసన్నపేట : గ్రామాల్లో ఎటువంటి వివాదాలు లేకుండా గ్రామ కంఠ భూములు సర్వే వేగవంతం చేయాలని ఎంపిడిఒ వెంకటేశ్వర ప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో యి ఉద్యోగులు తో సమీక్ష సమావేశం నిర్వహించారు.అలాగే శ్వమిత్రా (గ్రామ కంఠ భూములు సర్వే) పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.గ్రామాలలో ఆలయ భూముల,గ్రామ కంఠము భూములు సర్వే చేసి, హద్దులు నిర్ణయించి హద్దురాళ్ళు కూడ పాతాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల, వీఆర్వో లు, డిజిటల్ అసిస్టెంట్ లు, విలేజ్ సర్వేర్లు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి

పలాస : పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు గణనీయంగా పెరిగాయని, ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు తోడుగా ప్రణాళికా బద్ధమైన బోధన అందిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది ఆరు గ్రూపులు ఉన్నాయన్నారు. ఈ ఏడాది 390 మంది విద్యార్థులు చేరారని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం, పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

భూమిని పరిశీలిస్తున్న సింహాచలం

ఆ భూమి దళితులకే చెందాలి

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని పిరువాడ పంచాయతీ గవరంపేట దళితులు అనుభవంలో ఉన్న భూమి వారికే చెందాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గవరంపేటలోని వివాదస్పద స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి గ్రామ దళితులు ఆ స్థలంలో పశువులు మేపుకుంటున్నారని అన్నారు. కొండగుట్ట కావడం వల్ల ఆ ప్రాంతంలో ఎటువంటి వ్యవసాయానికి అనుకూలంగా లేనందువలన పశువులు పాక వేసుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని కొంతమంది పెత్తందారులు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఈ భూమి జిరాయితీ భూమిని విశాఖపట్నంలో ఉన్న ముని కోటి శ్రీనివాసు శాస్త్రిది అని పోలీసు వారు చెబుతున్నారని అన్నారు. అలాగే ఈ భూమి ముద్దాడ రామారావు జిరాయితీ అని తహశీల్దార్ చెప్పినట్లు తెలిసిందన్నారు. అసలు ఈ భూమి ఎవరిదో రెవెన్యూ అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 30 సెంట్లు కొండ పోరంపోగు భూమిని అనేక సంవత్సరాలుగా దళితుల అనుభవం ఉందని తెలిపారు. స్థానిక రెవెన్యూ అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేసి దళితులకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. దళితులంటే గిట్టని మొజ్జాడ ఆనందరావు, మొజ్జాడ ఉమా వారి రాజకీయ పలుకుబడిని ఉపయోగించి భూమి దళితులకు దక్కకుండా చేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్రి శ్రీను, కర్రి కుసిరాజు, కర్రి దేవి, దేవాది రామారావు, దేవాది అక్కమ్మ, సిఐటియు నాయకులు కాల నరసింహ, కెవిపిఎస్ నాయకులు తలచేంద్రి, మోహనరావు, దివ్వల రమణ పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై నిలదీయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

చంద్రబాబు సూపర్ సిక్స్ మోసాలపై ప్రజలు నిలదీయాలని వైసిపి మండల ఉపాధ్యక్షులు దున్న బాలరాజు అన్నారు. మండలంలోని అమలపాడు, సుంకర జగన్నాథపురం గ్రామాల్లో బుధవారం బాబు షూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు ఇచ్చి మోసపూరిత హామీల గురించి వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామలు అమలు చేయకుండా కూటమి నేతలు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నరని అన్నారు. రాష్ట్రంలో ఆరాచక పాలన సాగుతోందని అన్నారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకి వెన్నతో పెట్టాన విద్య అని అన్నారు. ఈ సందర్భంగా క్యూర్ కోడ్ చూపించి బాబు మోసాలను ఒక్కొక్కటిగా తెలుసుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దున్న రత్నం, జి.గున్నమ్మ, వైసిపి నాయకులు సౌదాల వెంకన్న, గొరకల విశ్వనాథం, రెయ్యిపాడు సర్పంచ్ బత్సల ధర్మారావు, చింత హేమారావు, ఎ. గోవిందరావు, వంక చిరంజీవిరావు, పోతనపల్లి లింగరాజు, కారాడ గిరిబాబు, డి.డిల్లీరావు, దున్న మురళి తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : బాబు మోసాలను వివరిస్తున్న వైసిపి నాయకులు

రణస్థలం : చంద్రబాబు మోసాలను వివరిస్తున్న కిరణ్ కుమార్

రణస్థలం: చంద్రబాబువి మోసపూరిత హామీలని, ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని చిల్లపేటరాజాం, పతివాడపాలెంలో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపగడపకు వెళ్లి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని అన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబుని నమ్మి ఓటు వేసినందుకు అన్నివర్గాల ప్రజలు మోస పోతున్నారని, ఈ విషయాలన్నింటిని ప్రజలు గమనించి రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రాయపురెడ్డి భుజంగరావు, గొర్లె అప్పలనాయుడు, పిన్నింటి సత్యం నాయుడు, మజ్జి రమేష్, దన్నాన హరి, బాకి సూర్యనారాయణ రెడ్డి, నేతల కృష్ణ, ముద్దాడ రాజశేఖర్, డొప్ప రాము తదితరులు పాల్గొన్నారు.

బెంతు ఒరియాల సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- కవిటి

తమ సమస్యలు పరిష్కరించాలని సుమారు 580 రోజులకు పైగా దీక్షలు చేస్తున్న బెంతు ఒరియాలకు న్యాయం చేసి వారి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ నాగబాబును కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోళ్ల రాజేష్ కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో జనసేన నాయకులు, కార్యకర్తలతో నాగబాబు నిర్వహించిన సమీక్షలో రాజేష్ మాట్లాడారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ సమస్యలు నాగబాబు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా వంశధార నుంచి వచ్చే నీరు ఇచ్ఛాపురం నియోజకవర్గం వరకు చేరేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. వంశధార - బహుద నదుల అనుసంధానం జరిగితే పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు వరకు ఈ కాలువ విస్తరించి ఉన్నట్టు తెలిపారు. మాట్లాడుతూ ఈ సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి నియోజకవర్గ రైతాంగానికి అండగా నిలిచి, వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

మాట్లాడుతున్న రాజేష్

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- రహస్య ప్రదేశాల్లో రోజూ లోడింగ్
- అటవీశాఖ అధికారులకు భారీగా ముడుతున్న ముడుపులు!

సుభద్రాపురంలో రహస్య ప్రదేశంలో లారీల్లోకి లోడు చేస్తున్న టేకు కలప

ప్రజాశక్తి- లావేరు

మండల వ్యాప్తంగా ఏ గ్రామంలో చూసినా టేకు, అకేసి, నీలగిరి విలువైన కలప ఇతర రాష్ట్రాలకు రోజూ లారీల్లో తరలిపోతుంది. మండలంలోని బొంతుపేట, బోరపేట గ్రామాల్లో జాతీయ రహదారికి అనుకుని ఉన్న కర్రల డిపోల్లో వేబ్రిడ్జి వద్దనే నీలగిరి కర్రలు మాటున పట్టపగలే నిత్యం టేకు, అకేసి కలపను అక్రమార్కులు లారీల్లో లోడింగ్ చేసి తెలంగాణ, ఒడిశా రాష్ట్రలకు తరలిపోతున్న వైనాన్ని ప్రజాశక్తిలో ఏప్రిల్ 14న నీలగిరి మాటున టేకు తరలింపు అనే శీర్షికతో కథనం వెలువడడంతో అక్కడ నుంచి అక్రమార్కులు పంథాను మార్చారు. ప్రజలు, అధికారులను ఏమార్చుతూ రహస్య ప్రదేశాల్లో చుట్టూ తోటలు, జన సంచారం లేని ప్రదేశాలను ఎంచుకొని అక్కడకి టేకు, అకేసి కలపను ట్రాక్టర్‌తో రహస్య ప్రదేశాలకు తరలించి పెద్ద లారీల్లో లోపల టేకు, అకేసి కర్ర వేసి లోడింగ్ చేసి అనంతరం పైకి నీలగిరి కర్ర కనిపించేలా లోడింగ్ చేసి మాయ చేసి కాసులు కళ్ల చూస్తున్నారు. ఇదంతా అటవీశాఖ అధికారులకు కేసులు లేకుండా, అక్రమ రవాణాకు అడ్డు లేకుండా అటవీశాఖలోని వివిధ స్థాయిల అధికారులకు నెలవారీ మామ్మూళ్లుభారీస్థాయిలో ముట్ట చెప్పుతున్నట్లుగా బాహాటంగానే ప్రజల్లో చర్చ జరుగుతుంది. అక్రమార్కులు సుభద్రాపురంలోని ఓ లేఅవుట్‌లో జన సంచారం లేని తాటిచెట్లు మధ్య, గురుగుబిల్లి, బొడ్డపాడు గ్రామాల పరిధిలో టేకు కలప లోడింగ్ చేస్తూ తరలిస్తున్నారు. బుధవారం సుభద్రాపురం లేఅవుట్‌లో రహస్య ప్రదేశంలో ట్రాక్టర్లు, వ్యాన్‌లో తెచ్చి లారీల్లో లోడింగ్ చేస్తున్నారు. ఇంత బహిరంగంగా, విచ్చలవిడిగా అక్రమంగా రవాణా జరుగుతున్నా అటవీశాఖాధికారులకు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి లక్షల విలువైన టేకు, అకేసి కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

లారీలోకి టేకు కలప లోడింగ్ చేస్తున్న కూలీలు

తండ్రి చితికి తలకొరివి పెడుతున్న కుమార్తె అనురాధ

తండ్రికి కుమార్తె తలకొరివి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని నందికొండ గ్రామంలో బుధవారం తండ్రి చితికి కుమార్తె తలకొరివి పెట్టిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కూన సింహాచలం ఐదేళ్ల క్రితం పక్షవాతంతో కాలు, చెయ్యి అంగవైకల్యం బారిన పడ్డాడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు వైకుంఠరావు కూడా ఇటీవల పక్షవాతం జబ్బుకు గురై కాలు, చేతులు అంగవైకల్యం పొంది లేవలేని పరిస్థితిలో మంచాన పడ్డాడు. అనారోగ్యంతో బుధవారం సాయంత్రం సింహాచలం మృతి చెందడంతో తలకొరివి పెట్టాల్సిన కుమారుడు లేవలేని పరిస్థితిలో ఉండటం పలువురిని కంటతడి పెట్టించింది. దీంతో మృతుని చిన్న కుమార్తె పురుషోత్తపురం గ్రామానికి చెందిన పైడి అనురాధ తండ్రి చితికి తలకొరివి పెట్టడానికి ముందుకు రావడంతో గ్రామస్తులు వెంటనే అంత్యక్రియల ఏర్పాట్లు ప్రారంభించారు. స్థానిక స్మశాన వాటికలో నిర్వహించిన సింహాచలం అంత్యక్రియలకు కుమార్తె అనురాధ తలకొరివి పెట్టి ఆదర్శంగా నిలవడంపై పలువురు విచారం వ్యక్తం చేస్తూ అభినందించారు.

మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుజాత

చిన్నారుల బరువు నమోదు చేయాలి

పొందూరు: అంగన్వాడీ కేంద్రాల పరిధిలో గల చిన్నారుల ఎత్తు, బరువులను సక్రమంగా కొలిచి యాప్‌లో నమోదు చేయాలని సూపర్‌వైజర్ జి.సుజాత అన్నారు. మండలంలోని లోలుగులో బుధవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంబంధించిన వివరాలను పోషణ్ ట్రాకర్, బాలసంజీవిని యాప్‌ల్లో నమోదు చేయాలని పేర్కొన్నారు. అలాగే యాప్‌లో నిర్దేశించిన పేర్లకు సంబంధించిన వారి గృహాలను సందర్శించి వివరాలను పొందుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డైరీలతో విద్యార్థులు

చదువుపై శ్రద్ధ వహించాలి

నరసన్నపేట: విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలంటే చదువుపై శ్రద్ధ వహించాలని డిప్యూటీ డిఇఒ వి.విజయకుమారి సూచించారు. నరసన్నపేటలోని ప్రభుత్వ, దేశవానిపేట ప్రాథమిక పాఠశాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఏవిధంగా చదువుతున్నారు, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు బోధన, హాజరు, మధ్యాహ్నం భోజనం పథకం తదితర అంశాలపై నిశితంగా పరిశీలించారు. అలాగే ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు డైరీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ యు. శాంతారావు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

పి-4 లక్ష్యాలను పూర్తి చేయాలి

పొందూరు: ప్రజల భాగస్వామ్యంతో పేదరికాన్ని నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పి4 విధాన లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలని నియోజకవర్గం ప్రత్యేకాధికారి, మత్స్యశాఖ డిడి వై.సత్యనారాయణ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పి4 విధానంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి4 విధానాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఆగస్టు 7లోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసేలా కసరత్తు చేయాలన్నారు. సచివాలయాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో 9,023 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. అలాగే పొందూరు మండలంలో 2,549 బంగారు కుటుంబాలను గుర్తించగా, దీనికి సంబంధించి సుమారు 890 మంది మార్గదర్శకులను అనుసంధానం చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రఘునాథ్, ఎంపిడిఒ మీసాల మన్మథరావు, కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఎఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

శ్రీకాకుళం సిటీ: వార్డు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న ఎఎన్‌ఎంలకు పదోన్నతలు కల్పించాలని ఎఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం సమావేశ మయ్యారు. గ్రేడ్-3లో పనిచేస్తున్న వారికి ప్రభుత్వ జిఒ మేరకు గ్రేడ్-2గా పదోన్నతి కల్పించాలన్నారు. జిఒ ఇచ్చినా అమలు చేయడం లేదని అవేదన వ్యక్తం చేశారు. గతేడాది సెప్టెంబర్‌లో జిఒ విడుదలైనా ఇంతవరకు అమలు చేయడం లేదని వారు ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించకుంటే భవిష్యత్‌లో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.

సమావేశమైన ఎఎన్‌ఎంలు

మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

మ్యాపింగ్ వేగవంతం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో బదిలీపై వచ్చిన సచివాలయ ఉద్యోగులు ఆగస్టు నెల పింఛన్ల పంపిణీకి సక్రమంగా మ్యాపింగ్ చేయాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో అడ్మిన్, వెల్ఫేర్ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన బదిలీల ప్రక్రియలో సచివాలయాలకు కొత్తగా వచ్చిన సిబ్బందిని క్లస్టర్ల వారీగా మ్యాపింగ్ చేసి పింఛన్లు సక్రమంగా అందేటట్లుగా చూడాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో ఎటువంటి ఇబ్బంది కానీ, అసౌకర్యం గాని కలుగకుండా వ్యవహరించాలని అన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఆక్రమణలు కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు చేసిన ఆక్రమణలు కప్పిపుచ్చుకునేందుకే వైసిపిపై ఆరోపణలు చేశారని మండల వైసిపి నాయకులు నాయకులు కాళ్ల సంజీవరావు, కమ్మకట్టు శ్రీనివాస్‌రెడ్డి, కల్లి విశ్వనాథరెడ్డిలు అన్నారు. వారు బుధవారం వైసిపి నాయకుడు జనార్ధన్ స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. 200 ఎకరాలకు సాగునీరు అందించే సుమారు 30 ఎకరాలు ఉండే పెద్దచెరువును గోవిందరాజులు అక్రమించుకున్నారని విమర్శించారు. కోటబొమ్మాళి కొండ పక్కన జర్జంగికి చెందిన దొరమ్మ దగ్గర అప్పట్లో 25 ఎకరాలు కొనుగోలు చేసి పక్కన ఉన్న కొండ పోరంబోకు స్థలం 15 ఎకరాలను కబ్జా చేశారని, వీటిపై పలువురు కలెక్టర్‌కు, టెక్కలి ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. మంత్రుల మెప్పుకోసం ఉత్తరాంధ్రను వైసిపి నాయకులు దోచుకున్నారని గోవిందరాజులు ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశం వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు అన్యపు రామారావు, వైసిపి మండల అధ్యక్షులు సంపతిరావు హేమసుందరరాజు, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల విప్ బొడ్డు అప్పన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి మాధురి

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తం

ప్రజాశక్తి- పలాస

మానవ అక్రమ రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి న్యాయమూర్తి యు.మాధురి అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా బుధవారం కోర్టులో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా చాలా భయంకరమైందన్నారు. ఈ విషయంలో ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ కారణాల వల్ల బాలబాలికలు అక్రమ రవాణా గురవుతున్నారని అన్నారు. బాలల సంరక్షణకు 1098 టోల్ ఫ్రీ నెంబర్ను ఉపయోగించుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బికేర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జిఎంఎస్ అనిల్ రాజ్, ఎజిపి పిండి వెంకటరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పొందూరు

విద్యార్థులు చట్టాలపై అవగాహనను పెంచుకోవాలని ఎఎస్‌ఐ రమణమూర్తి అన్నారు. మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శక్తిటీం ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న మహిళలు తప్పనిసరిగా శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బల్ల కంటయ్య, సిబ్బంది మోహనరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దాడుల నుంచి రక్షణ పొందడంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

లావేరు : పోస్టర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

మెళియాపుట్టి : పోస్టర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పొందూరు : పోస్టర్లను అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి పాలన సాగుతోందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని గొప్పిలిలో బుధవారం సుపరి పాలనలో తొలి అడుగులో భాగంగా గ్రామంలో పలువురి ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. త్వరలో రైతన్నలకు రైతు భరోసా అందజేస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు అన్ని నూటికి నూరు శాతం అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, టిడిపి మండల అధ్యక్షుడు నంబాల వెంకటరావు, బొచ్చు ప్రసాదరావు, రాజశేఖర్ రెడ్డి, కదంబల పైడిరాజు, పరమేశ్వర్ రెడ్డి, బమ్మిడి జగన్నాథం, బైరసింగి దినకర్, విష్ణు ప్రసాద్ పండా తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని శిలగాం సింగువలసలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్యెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను వివరిస్తూ, సమస్యలపై ఆరాతీసారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, కంచు దశరథుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని బొడ్డేపల్లిలో మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు బొడ్డేపల్లి సత్యం ఆధ్వర్యంలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నవి లేనివి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించి యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని 10వ వార్డు హడ్కో కాలనీలో తొలి అడుగు కార్యక్రమాన్ని రాష్ట్ర యాదవ సంఘం యువజన విభాగ కార్యదర్శి నాగళ్ల మురళీధర్ యాదవ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కారుణ్య ధర్మారావు, తంగి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని మురపాకలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అందించిన పథకాలు, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, తహశీల్దార్ జిఎల్ఇ శ్రీనువాసరావు, ఎంపిడిఒ పి.వెంకట రాజు, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్య దొర, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసిలు పి. మధు బాబు, ఆర్.ప్రకాశరావు, నాయకులు జల్లెపల్లి జనార్దన్, మడ్డి కనకయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని పైడి భీమవరం పంచాయతీలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లంక శ్యామలరావు, కలిశెట్టి సూర్యనారాయణ, మండల పార్టీ జనరల్ సెక్రటరీ మండపాక కనకారావు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పిన్నింటి బానోజీనాయుడు, పైడిభీమవరం సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు, మండల మాజీ వైస్ ఎంపిపి దుమ్ము అశోక్, క్లస్టర్ ఇన్‌ఛార్జి మండల రాము నాయుడు, కోరాడ వెంకటరమణ, మైలపల్లి పోలీస్, నాయకులు మజ్జి వెంకటరమణ, కెళ్ళహేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి నరసన్నపేట

సిఎం సహాయనిధి అనేది ప్రజలకు భరోసా అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో 12 మంది బాధిత కుటుంబాలకు సిఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు పాలనలో ఆరోగ్యం, విద్యా రంగాల్లో విస్తృతమైన సహాయం అందుతోందన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, సొసైటీ చైర్మన్ బైరి భాస్కరరావు, బోర వెంకట రమణ, జి.చిట్టిబాబు, ఎస్.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: పేద ప్రజలకు వరం సిఎం సహాయనిధి అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శిలగాం సింగువలసకు చెందిన ధర్మాన పద్మ కుటుంబానికి సిఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కంచు దశరథుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు. అలాగే విశాఖ ఎ కాలనీ కార్యాలయంలో కార్పొరేషన్‌కు చెందిన దమ్మిశెట్టి జగదీశ్వరి, రూరల్ మండలం సింగపురానికి చెందిన చెందిన బరాటం లక్ష్మీదేవి, గార మండలం అంబటి ఎరుకువాని పేటకు చెందిన అంబటి సూర్యనారాయణకు చెక్కులను వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

ఇచ్ఛాపురం: మండలం తులసిగాం పంచాయతీ బలరాంపురానికి చెందిన లండ శంకర రెడ్డికి సిఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.72,292 చెక్కును టిడిపి నాయకులు అందించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న శంకర రెడ్డి మెరుగైన శస్త్రచికిత్స కోసం సిఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ విప్ డాక్టరు బెందాలం అశోక్ చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో టిడిపి నాయకులు వి.శంకర్ నారాయణ, పి.వాసు, సీరపు జోగారావు, పైల పాపారావు, లండ మాధవ్, లండ చిన్న, చంద్రయ్య, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

రైతులకు అండగా ఉండాలి

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

ప్రజాశక్తి- కవిటి

అన్నదాతను ఆదుకునేందుకు అన్నివేళలా సిద్ధంగా ఉండాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గానికి ప్రభుత్వ విప్, ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన అధ్యక్షుడిగా బి.మణిచంద్ర ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా దాసరి శేఖర్‌తో పాటు కార్యవర్గసభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం మండలంలోని గొర్లెపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరైన మణి చంద్రప్రకాష్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం శుభ పరిణామమన్నారు. తన పనితీరుతో భవిష్యత్‌లో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కొత్త కార్యవర్గం ఖరీఫ్ సీజన్‌లో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టి రైతులకు మేమున్నామని భరోసా కల్పించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి ప్రభుత్వం రైతులకు బకాయిపడ్డ ధాన్యం డబ్బులు కూడా చెల్లించి రైతులకు అండగా నిలిచిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు, పిఎసిఎస్ అధ్యక్షులు, కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ప్రతిభకు పదును తప్పనిసరి

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు ఎప్పటికప్పుడు మెరుగులుదిద్దాలని, దానికి క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు అవసరమని బి.జి.పుట్టుగ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరభద్రరావు అన్నారు. పాఠశాలలో ఇప్పటివరకు నిర్వహించిన పాఠ్యాంశాలపై బుధవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బాబూరావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రసాద్, వైకుంఠరావు మన్మథరావు, జోష్న, వెంకటరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం: మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన డొంకూరు, చిన్నలక్ష్మీపురం, పెద్దలక్ష్మీపురం, శివరామకృష్ణాపురంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహింఆచరు. ఈ శిబిరంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేవారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మోహన్ వెంకటేష్, కార్యదర్శి కాదా రామకోటి, తులసీదాస్, గోపీచౌదరి, పి.దినేష్, ఎం.నవీన్, ఎల్.సి.రావు, బడే రామారావు, లోకేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ రాజేంద్రప్రసాద్

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతతో కూడిన శాస్త్రీయ విద్య అందుతోందని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ విద్య దోహదపడుతుందని ఎంఇఒ జి.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యారంగ బలోపేతానికి సహకరించాలన్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధనను అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మరింత సన్నిహితంగా ఉండి విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వేయాలన్నారు. విద్యారంగంలో చేసిన కృషిని కొనియాడుతూ ఎంఇఒ రాజేంద్రప్రసాద్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.ఎ.రాములు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, సీనియర్ ఉపాధ్యాయులు పి.రవికుమార్, పి.మోహనరావు, సిహెచ్ సుబ్బలక్ష్మి, షేక్ షావలి, బిఎ. శివరాజ్, జి.అప్పారావు, కోట ఈశ్వరరావు, ఎం.ఉమా కుమారి, జి.కుమారి, ఎంవిఆర్ బట్లు, ఉగాది, సిహెచ్ నాగేశ్వరరావు, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

మురపాక మండలం ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి- లావేరు

మురపాకను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావు ప్రజలకు హామీఇచ్చారు. బుధవారం మురపాకలో నమస్తే ఎచ్చెర్ల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత గ్రామస్తుల నుంచి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లినగరం నుంచి కుప్పిలి వరకు రహదారి విస్తరణకు మురపాక మీదగా బైపాస్ రోడ్డుకు నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. మురపాలో ఇంటింటికి కుళాయిల ఏర్పాటుకు రూ.1.36 కోట్లతో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎస్‌సి, బిసి, యాదవ సామాజిక తరగతులకు ప్రత్యేకంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆర్యవైశ్యలకు శ్మశానం, రహదారి ఏర్పాటుకు తక్షణం రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకంలో ప్రతి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, తహశీల్దార్ జిఎల్ఇ శ్రీనువాసరావు, ఎంపిడిఒ పి.వెంకటరాజు, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసిలు పి.మధుబాబు, ఆర్.ప్రకాశరావు, టిడిపి నాయకులు జల్లెపల్లి జనార్దన్, మడ్డి కనకయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

మాట్లాడుతున్న ఎంఇఒ మురళీకృష్ణ

ఇంటర్, టెన్త్ ప్రవేశాలకు అవకాశం

ప్రజాశక్తి- లావేరు

సార్వత్రిక విద్యాపీఠానికి సంబంధించి 2025 -26 సంవత్సరానికి ఇంటర్మీడియట్, టెన్త్ క్లాస్‌లో ప్రవేశానికి అవకాశం ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ-2 మజ్జి మురళీకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, సిఆర్‌ఎంటిఎస్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో ఉన్నత విద్యను అభ్యసించే అభ్యర్థులకు ఓపెన్ స్కూల్ విధానంలో నేరుగా టెన్త్, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందేందుకు సువర్ణ అవకాశమన్నారు. ఈ విషయంపై గ్రామస్థాయిలో చైతన్యం కలిగించాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.వెంకటరాజు, డిప్యూటీ ఎంపిడిఒ పద్మజ, కార్యదర్శులు పాల్గొన్నారు.

సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- కవిటి

పాత కొజ్జిరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పి.నవత, బి.పద్మ కుమారి, పి.వాసుదేవరావు, చంద్రశేఖర్, జగన్నాథ్ సాహూ, పి.హరిబాబు, దేవరాజ్ త్రిపాఠి, ఎన్.ఏకాంబరేశ్వర శర్మల సేవలు కొనియాడి పాఠశాల తరఫున ఘన సన్మానాలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి ముఖ్య అతిథిగా హాజరై బదిలీ ఉపాధ్యాయుల సేవలను ప్రశంసించారు. అనంతరం ఎంఇఒను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.

కార్డాన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

సరైన పత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ద్విచక్ర వాహనాలకు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్ఐ సనపల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్‌టిఆర్ నగర్ కాలనీ, జగనన్న కాలనీ, తిమ్మాపురం ప్రాంతాల్లో ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు ఇంటింటికి వెళ్లి వాహనాలు, వ్యక్తుల వివరాలు, అనుమానాస్పద కదలికలపై సుదీర్ఘంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండటం తప్పనిసరని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేకపోతే వాహనాలు సీజ్ చేయబడతాయని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సీపాన కాంతారావు, పోలీసులు పాల్గొన్నారు.

నదిలో వ్యర్థాలు వేయొద్దు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కోళ్లు, గొర్రెల మాంసం వ్యర్థాలు బాహుదా నదిలో వేయొద్దని, డంపింగ్ యార్డుకు తరలించాలని జడ్జి పరేష్ కుమార్, కమిషనర్ రమేష్ సూచించారు. కోర్టు ప్రాంగణంలో పురపాల సంఘం పరిధిలోని చికెన్, మటన్ షాపు యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాహుదా నది వంతెన వద్ద మాంస వ్యర్థాలను వేస్తుండడంతో ఆ ప్రాంతానికి చెందిన వ్యరేతిస్తున్నారని అన్నారు. నిర్దేశించిన డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. పట్టణ ప్రాంతంలోని రోడ్లపైకి ఆవులను విడిచి పెట్టరాదని సంబంధిత యజమానులకు హెచ్చరించారు. ఆటో ఏర్పాటు చేసి మైక్ ద్వారా ప్రచారం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర కుమార్, మాంసం షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి పరేష్ కుమార్

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీమోహన్, ఎపిఐఐసి కమిషనర్ జయచంద్ర అన్నారు. ఎపిఐఐసి అధికారులు పారిశ్రామికవాడలోని వ్యాపారులతో అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు అధ్యక్షతన బుధవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐఎఎల్ఎ ద్వారా పారిశ్రామికవాడలో ఎంత వరకు ఏవిధమైన పనులు చేపట్టారు... వాటికి ఎంత ఖర్చు అయ్యింది.... ఇంకా నిధులు ఎంత మేరకు మిగిలి ఉన్నాయనే వాటిపై వ్యాపారుల నుంచి అరా తీశారు. పారిశ్రామికవాడలో అత్యవసరంగా చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలు గురించి సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మెట్టమెదటిగా జంగిల్ క్లియరెన్స్, డ్రైన్స్ క్లీనింగ్, గ్రీన్బెల్ట్లో మొక్కలు నాటడం, కమ్యూనిటీ బిల్డింగ్ నిర్మాణానికి 200 అడుగుల స్థలం కేటాయింపు, ఎలక్ట్రికల్ మరమ్మతులు, అవసరమైన చోట కొత్త లైట్లు వేసేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి కొంచాడ వినయ్, ఉపాధ్యక్షులు తాళాను శ్రీనివాసరావు, తాళాను వరసింహమూర్తి, శాసనపురి పాండురంగారావు, మల్లా కాంతారావు, పెంట సునీల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మురళీమోహన్, జయచంద్ర

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని లోలుగు సబ్‌స్టేషన్ పరిధిలో ఆగస్టు 1వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ ఇఇ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోలుగు గ్రామంతో పాటు ఇండస్ట్రియల్ లైన్‌లో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆమదాలవలస: పట్టణంలోని 33/11 కె.వి. ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో కణుగులవలస ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయం దగ్గర చెట్టు కొమ్మలు తొలగించే కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయం, వెంగళరావు కాలనీ, కణుగులవలస ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అలాగే మండలంలోని తొగరాం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఇఇ పైడి యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ఆర్‌డిఎస్ఎస్ వర్క్స్ ద్వారా విద్యుత్ లైన్లు మార్చుట, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, నిర్వహణ కొరకు కొత్తవలస, పాతూరు, నిమ్మతొర్లాడ, జికె వలస, కొరపాం, చేపేనపేట గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయబడునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పలాస : పలాస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సూదికొండ ఫీడర్‌లో విద్యుత్ లైన్లు మరమతులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం నుంచి హరిశంకర్ థియేటర్ వరకు కెటి రోడ్డులో, శివాజీనగర్, సూదికొండ, ఐటిఐ కాలేజి ఏరియా, మారుతీనగర్, వివేకానంద కాలనీ, సాయిబుల కాలనీ, రోటరీనగర్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నరసన్నపేట : నరసన్నపేట టౌన్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహ కుమార్ తెలిపారు. 33/11 కెవి, టౌన్-1 పరిధిలోని చెట్టుకొమ్మలు తొలగింపు, మరమ్మతులు చేపడుతున్నామని అన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తహశీల్దార్ కార్యాలయం ఏరియా, నేతాజీ, కొత్తవీధులు, ఆదివారంపేట, బొంతల వీధి, వీరన్నాయుడు కాలనీ, బొరిగివలస, ఈదులవలస కూడలికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడు తుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.